

ఆకాశంలోకి పొగను చిమ్ముకుంటూవచ్చి స్టేషనులో ఆగింది రైలు. అప్పటివరకూ ఉన్న ప్రశాంతత అంతా క్షణంలో మాయమైపోయింది. ఎక్కేవాళ్ళు ఎక్కలేకుండా, దిగేవాళ్ళు దిగలేకుండా ఒకరినొకరు తోసుకుంటున్నారు ఊరికే.

ప్లాట్‌ఫారమ్‌మీద నిలబడి దూరంగా దేన్నో నిశితంగా చూస్తున్నాడు శ్రీహరి. బండితో పని లేదు కాబట్టి, అదివచ్చి ఆగిందని, ప్రయాణీకులు కంగారుపడుతున్నారనీ — ఈ గొడవ అతని కేమీ పట్టినట్టు లేదు.

"మాష్టారూ" అని తియ్యగా వినిపించడంతో ఉలిక్కిపడి ఇటు ప్రక్కకి తిరిగాడు. కళ్ళింత చేసుకొని, వింతగా చూసినట్టు తనవంకే చూస్తోందా అమ్మాయి. శ్రీహరి తనకళ్ళను తానే నమ్మలేకపోయాడు. క్షణకాలం అది కలో నిజమో తేల్చుకోలేకపోయాడు.

చెదిరిన నాలుగు వెంట్రుకలు ముందుకువచ్చి, ముఖంమీదపడి ఎగురుతూంటే, తెల్లనిచీర కట్టుకొని, మిసమిసా మెరిసిపోతోందా అమ్మాయి. ఆమె ముఖంలో ప్రయాణిక బడలిక ఏమాత్రం లేదు.

"జ్ఞాపకంలేనా మాష్టారూ?" నెమ్మదిగా అందామె.

"శ్యామలా!......" పంచస్వరాలు శ్రీహరి కంఠంలో ఒయకలిపినట్టు వచ్చిందా మాట. అతడు ఒకరకమైన ఆత్రుతతో ఉక్కిరిబిక్కిరై పోతున్నాడు.

"ఎంత మారిపోయావు శ్యామలా" అన్నాడు చివరకు.

శ్యామల ఎక్కడనుండివచ్చి, హఠాత్తుగా తన ఎదుట నిలబడిందో తెలియడంలేదు. బండిలో వచ్చిందా! లేక ఈ స్టేషన్నుంచి బండి ఎక్కుతోందా! తనకు తెలిసినంతవరకూ ఇక్కడనుండే బండి ఎక్కడానికి అవకాశంలేదు. బహుశా ఎక్కడినుండో వస్తూండవచ్చని ఊహించాడు శ్రీహరి. బండివి చూశాడు—ఎదురుగా, స్త్రీల కంపార్ట్మెంటు ఉంది.

"నేను కనబడిన వెంటనే ఇందులోనుండే దిగి వచ్చిఉండాలి" అని అనుకున్నాడు శ్రీహరి.

శ్యామల ఏమీ మాట్లాడకుండా శ్రీహరివంకే చూస్తోంది విచిత్రంగా.

"ఎక్కడినుండి వస్తున్నావు?" నిశ్శబ్దాన్ని భంగపరిచాడు.




శ్యామల నవ్వింది కొద్దిగా.

"ఎక్కడనుండి వస్తున్నాననుకుంటున్నారు?" ఎదురుప్రశ్నవేసి చూస్తోంది.

శ్రీహరి కేంతెలుసు ఎక్కడినుండి వస్తోందో. అడిగినప్రశ్నకు తిన్నగా సరియైన సమాధానం చెప్పకుండా, అడ్డప్రశ్నలు వేయడం శ్యామలకు మొదటినుండీ అలవాటేనని తనకు తెలుసు. ఏదైనా అడిగితే, దానికి సమాధానం చెప్పేముందు, ఆప్రశ్నను ఆధారంగా రెండు, మూడు ప్రశ్నలు, ఇతరత్రావి వేసి, అప్పుడు వేసిన మొదటిప్రశ్నకు సమాధానం చెబుతుంది.

"నువ్వెక్కడనుంచి వస్తున్నావో నాకేం తెలుస్తుంది శ్యామలా?" అమాయకంగా నవ్వాడు శ్రీహరి. వెంటనే శ్యామలకూడా నవ్వేసింది.

"బంధువులింటికి—అంటే మా పిన్నిగారి వూరు వెళ్ళానండి.....తిరిగి మా ఇంటికి వెళ్ళిపోతున్నాను. అయితే, మాష్టారూ, ఇక్కడున్నారేమిటి? ఇదేనా మీ ఊరు?"

ఆఖరిప్రశ్నలు రెండూ కుతూహలంగా అడిగేసింది. సమాధానంకోసం శ్రీహరిముఖంలోకి చూస్తోంది శ్యామల.

"అవును—ఇదే మా ఊరు"

"నిజంగా!......" ఆశ్చర్యంగా చూసింది శ్యామల.

శ్రీహరికి నవ్వు వచ్చింది, ఆమె ఎందుకంత ఆశ్చర్యపడుతోందో.

"నిజమే శ్యామలా! నేనేం అబద్ధం చెబుతున్నాననుకుంటున్నావా! "ఏం! ఇక్కడ దిగి ఈవేళకు మా ఇంటిదగ్గర ఉంటావా?" నవ్వుతూ అన్నాడు సర్దాగా.

"అయితే దిగుతాను మాష్టారూ."

ఆమె పెట్టెకేసి వెళ్ళింది.

శ్రీహరి కొయ్యబారిపోయాడు. తను మాట సర్దాగా అన్నాడుకాని, ఆమె దిగడం సంభవమవుతుందని కలలో కూడా అనుకోలేదు. అలాంటిది ఆమె పెట్టెకేసి నడుస్తూంటే అతని కేం చేయాలో తోచలేదు.

"నిజంగా దిగుతున్నావా శ్యామలా" అంటూ కంగారుగా కేకలేశాడు. ఆకేక ఆమెకు వినిపించిందో లేదో తెలియదు. పెట్టెలోకి ఎక్కి చిన్నపెట్టెను చేత్తో పట్టుకుని బండిదిగి వచ్చేసింది. శ్రీహరి అలా చూస్తూ నిలబడ్డాడు.

"నేను దిగడం ఇష్టంలేదా మాష్టారూ?" పెట్టె క్రిందపెడుతూ అడిగింది.

శ్రీహరి సిగ్గుపడిపోయాడు.

రైలు ప్లాట్‌ఫారమ్ కదిలింది. కూత వేసుకుంటూ, ముందుకు సాగిపోయింది.

"అప్పే అదికాదు శ్యామలా! నువ్వు మా ఇల్లు..."

"చూడలేననా?" చిన్నగా నవ్వింది. శ్రీహరికి నోట మాటరాలేదు. క్రిందికిచూస్తూ నిలబడ్డాడు ఏంచెప్పాలో తెలియక.

"చూడగలను—చూస్తాను. నా క్కావలసింది ఇల్లు. ఇంటి వైభవమే ననుకుంటున్నారా?....... రండి" అంటూ తొందరచేసింది అతనివంక చూస్తూ.

శ్యామలధైర్యాన్ని లోలోపల మెచ్చుకున్నాడు శ్రీహరి. తనకంటె, ఎంత చిన్నదయినా, మాటల్లో ఆమె దగ్గర ఓడిపోవడమేనని తనకు తెలుసు.

ఇద్దరూ స్టేషన్‌దాటి ఇవతలకు వచ్చారు.

"ఎంతదూరముంటుంది ఇల్లు?" శ్రీహరికేసి తిరిగిందామె.

"మూడుఫర్లాంగు లుంటుందిగానీ .... మాది పల్లెటూరని తెలుసునా? మీకుమల్లే టౌనుకాదు. మా ఇల్లు నీకు నచ్చుతుందా అని......"

"అదిగో! ఆమాట మరలా అనకండి. రండి వెళ్దాము" నిజంగానే కోపపడింది శ్యామల. ముందుకు నడిచింది. శ్యామల తనను కోపపడినందుకు శ్రీహరికి నిజానికి ఆనందమే కలిగింది.

శ్రీహరి రిక్షా పిలవబోయాడు. ఆమె వద్దని వారించింది. నడిచివెళ్ళాలనే ఆమె కోరిక.

సంధ్యా సమయం. పడమటి ఆకాశం ఎర్రగా ఉంది. సూర్యుని లేతఎరుపు శ్యామల తెల్లచీరపై పడి మబ్బురంగుతో మెరుస్తోంది. జంటలు జంటలుగా పక్షులు ఆకాశంలో ఎగిరిపోతున్నాయి. చుట్టూ ఎటుచూసినా, పచ్చనిచేలు పండి, తలలు ఊపుతున్నాయి. వాటిమీదనుండి చల్లగాలి వీస్తూ శరీరాన్ని పులకరింపచేస్తోంది.

ఈ ప్రకృతి అందాన్ని, సాయంసమయంలో తిలకిస్తూ నడుస్తూ ఉంటే శ్యామలకు ఒక క్రొత్త అనుభూతి కలిగింది. ఇంతటి ఆనందం ఎప్పుడూ పొందలే దామె.

"ఇంత చక్కటి గాలిని, ఎప్పుడైనా ఎరుగుదునా నేను" అనుకుంది మనసులో. పుట్టి పెరిగినది మొదలు ఆ కృత్రిమవాతావరణంలోనేతప్ప, ఎప్పుడైనా ఇలాంటి నిజమైన—ప్రకృతిలోకి వస్తేగా.

శ్యామల శ్రీహరివైపుకి తిరిగింది. అలా నడుస్తూనే.

"చెప్పండి మాష్టారూ! అప్పటినుండి ఇప్పటి వరకూ జరిగిందంతా—విపులంగా చెప్పండి." ఎంతో త్వరగానూ, ఉత్సుకతతోనూ అడిగేసింది. శ్రీహరి ముఖంవంక చూస్తూనే నడుస్తోంది—అతన్నేదో చదవటానికి ప్రయత్నిస్తోంది.

శ్రీహరి చిన్నగా నవ్వాడు. అది నవ్వాలని నవ్వలేదు. శ్యామల ఆ ప్రశ్న వేయడంతో దానికది వచ్చేసింది.

"......నాలో పెద్ద మార్పేమీ రాలేదు శ్యామలా! అప్పు డెలాఉన్నానో, ఇప్పుడూ అదే స్థితిలో ఉన్నాను.

# తొలకరి వానలు

ఇక అప్పటి విషయమంటావా, తర్వాత సంవత్సరం అక్కడ ఉండలేదు. నీకు తెలిసే ఉంటుందేమో అప్పుడు. కాలేజీమారి ఇంకో కాలేజీలో చేరి చదివాను. ఆ మార్చికి పరీక్ష పోయింది. మొన్న సెప్టెంబరులో బి. ఏ. పూర్తి చేశాను. పరీక్ష వ్రాసిన క్షణంనుండీ ఉద్యోగంకోసం ప్రయత్నిస్తూనే ఉన్నాను, కాని, ఎక్కడా దొరకలేదు.

మొన్నమాత్రం ఒకదానికి ఇంటర్వ్యూకి వెళ్ళి వచ్చాను. సెలెక్టు అయినట్టుకూడా వచ్చింది నిన్ననే. మరి ఉద్యోగం ఎక్కడ వస్తుందో తెలియదు.......ఇంకేమున్నాయి. అంతే—" పూర్తిచేసి, శ్యామలకేసి చూసాడు. ఆమె తల వంచుకుని ఏదో ఆలోచిస్తూ నడుస్తోంది.

గయ్యాళి భార్యతో వేగలేక వరదయ్య దేశం కాని దేశం పారిపోయాడు. వెతకి వెతకి ఆమె చివరకు ఎలాగో అక్కడికి వెళ్ళింది. ఆమెను చూస్తూనే వరదయ్య స్నానాలగదిలోకి దౌడుతీసి, తలుపు బిడాయించాడు. అతడు ఎంతకూ బయట పడక పోతే తలుపు బద్దలు కొట్టి ఆమె లోనికి వెళ్ళింది!

"ఆఖరికి స్నానం చెయ్యాలన్నా నీగోల తప్పదన్నమాట?" వరదయ్య మాటలు నూతిలోంచి వచ్చినట్టు వచ్చాయి.

పి. కృష్ణమూర్తి (మదనపల్లి)

"చాలా క్లుప్తంగా చెప్పేశారు?" ఆమె ముఖంలో చిన్న దరహాసరేఖ మెరిసింది. సమాధానంకోసం తడుముకుంటున్నాడు శ్రీహరి. 'నిజమే; చాలా క్లుప్తంగానే చెప్పాను ఇన్నిరోజులనుండి జరిగిందీ...' అనుకున్నాడు.

"నే నొకటి అడుగుతాను చెప్తారా?"

శ్రీహరి ప్రశ్నార్థకంగా ఆమెముఖంలోకి చూసాడు.

"మీరు పెండ్లి చేసుకున్నారా?" ఆమె తాపీగానే అడిగింది. శ్రీహరికూడా అదే ఊహించాడో ఏమో.

"నువ్వేలా అనుకుంటున్నావు?" తిరిగి ప్రశ్న వేశాడు. ప్రశ్నయితే వేశాడుగాని, అతని ముఖంలో నవ్వుమాత్రం లేదు.

శ్యామల ముందే ఊహించుకుంది శ్రీహరికి పెళ్లయిందో లేదో. అందుకనే, అంత తాపీగా అడిగింది ఇపుడు పూర్తిగా తెలిసిపోయింది. చిన్నగా నిట్టూర్పు విడిచింది.

* * *

శ్రీహరి నడుస్తున్నాడేగాని, అతని బుర్రంతా ఆలోచనలతో నిండిపోయింది. శ్యామల ప్రక్క నడుస్తూఉంటే గతమంతా కళ్ళకుకట్టినట్లు కనిపిస్తోంది—అంతా నెమరువేసుకోసాగాడు.

కాలేజీలోచేరి, చదివేస్థితి తనకు లేదని తెల్సును. అయినా, తను వెళ్లి కాలేజీలో చేరాడు బీదస్థితి లోనే. చదువుకుందామనిఉంది. ఎవరైనా సహాయం చేయకపోతారా అన్న ధీమాతోనే చేరగలిగాడు. మనసులోని ఆలోచనకున్నంత ధీమా, కార్యరూపంలో చూడలేము. శ్రీహరి అనుకున్నంత ఇదిగా ఎవ్వరూ సహాయం చెయ్యకపోయినా, మొత్తానికి చాలమంది తమ సహృదయతను వెల్లడించారు.

తను అర్థించినవాళ్ళు, చందాలు ఇచ్చినవాళ్ళు చాలమంది ఉన్నారు. వారిలో శివరామయ్యగారు ఒకరు. చందా ఇచ్చినప్పుడే కాకుండా వేరే ఇంకోచోట విచిత్రంగా పరిచయమైంది ఆయనతో శ్రీహరికి. అది నాలుగురోజులకు స్నేహంగామారి వా రిద్దరి మధ్య సద్భావాన్ని కలిగించింది. శివరామయ్యగారు కూడా శ్రీహరిమీద మంచి అభిప్రాయమే చూపించారు.

తరచుగా శివరామయ్యగారింటికి వెళ్తూఉండేవాడు శ్రీహరి. సరిగ్గా ఇలాగే ఎందుకు జరగాలని కాదు, కాని కొందరి జీవితంలో ఇలాంటివి కొన్ని ఇలాగే జరుగుతుంటాయి అనుకోకుండా. శివరామయ్యగారి కుటుంబముతో చనువు అయిన కొద్దీ ఇంచుమించు ప్రతిరోజూ సాయంకాలం తప్పక వారింటికి వెళ్లేవాడు శ్రీహరి. వారందరి మధ్యా బాగా చనువు ఏర్పడింది.

ఒకరోజున శివరామయ్యగారు యధాలాపంగా మాట్లాడుతూ, "రోజూ వచ్చి ఒక గంట ఎలాగూ ఉంటున్నావు, ఆ టయంలో మా అమ్మడికి కాస్త ఏమైనా తెలియనివి చెబుతుంటావేమిటి?" అని అడిగారు శ్రీహరిని.

దీనికి శ్రీహరి తబ్బిబ్బయ్యాడు. తనెప్పుడూ ఇలా ఎవరికీ ట్యూషన్‌లాంటిది చెప్పలేదు. అయినా 'సరే' నన్నాడు. ఎవరైనా ఏమైనా చెప్తే దాన్ని కాదనడం అతనికి చేతకాదు. అది తనకు ఇష్టంలేకపోయినా, ఎదుటివారికోసం 'సరే' అనే తత్వంగలవాడు శ్రీహరి. ఎదుటివాళ్ళను నొచ్చుకోనివ్వడు.

రోజూ వెళ్ళి శ్యామలకు తెలియనివి చెబుతూండేవాడు. ఇప్పు డీ క్రొత్తబాధ్యత వచ్చినప్పటినుండీ తప్పనిసరిగా రోజూ శివరామయ్యగారింటికి వెళ్ళవలసి వచ్చేది. కాని, ఈ పద్ధతిలోనే అతనికి ఏదో తెలియని ఆనందం కనబడేది క్రమేపీ.

శ్యామల చాలా చలాగ్గా ఉండేది. మొదట్లో శ్రీహరిదగ్గరకు రావడం ఆమెకు బెరుగ్గా ఉండేది. తర్వాత అలవాటుపడిపోయింది. ఇద్దరిమధ్యా మంచి ఆత్మీయత పెరిగింది.

శ్యామలకు చిలిపితనం జాస్తి. ఆమె పాఠం వినేదికాదు. ఏవేవో ప్రశ్నలువేస్తూ, శ్రీహరిని తల్లక్రిందులుచేసేది రోజూ. నిజానికి ఆమె కసలు

ఎలా సమాధానం చెప్పాలో తెలిసేదికాదు శ్రీహరికి. పాఠం చెబుతుంటే వినకుండా అతని ముఖంలోకి చూస్తూ కూర్చునేది.

"పాఠం వినకుండా నా ముఖం చూస్తూ కూచుంటే ఎలా శ్యామలా?"

శ్యామల సిగ్గుతో ముఖం దించుకుని "పొండి మాష్టారూ" అంటూ, బుంగమూతిపెడుతూ మాట్లాడేదికాదు. ఆమెతో రాజీ పడాలంటే శ్రీహరి చాలా కష్టపడాల్సి వచ్చేది. మంచిమాటలుచెప్పి, బతిమాలుకొని తనకు ఆనందాన్ని కలిగిస్తేనే మాట్లాడేది.

రోజులు గడుస్తున్నాయి. వారిద్దరిమధ్యా ఆత్మీయత పెరిగింది. రోజూ ఒకరినొకరు చూసుకోకుండా ఉండలేనంతవరకూ వచ్చింది పరిస్థితి. 'ఎప్పుడు సాయంకాలం అవుతుందా, ఎప్పుడు మాష్టారు వస్తారా' అని ఎదురుచూస్తూ కూర్చునేది శ్యామల. ఒకరికొకరు బాగా దగ్గరైపోయారు. చదువు చెప్పడం పోయి, ఇద్దరూ రోజూ కబుర్లు చెప్పుకుంటూ గడిపేవారు. కొంతకాలంవరకూ ఎవరూ పట్టించుకున్నట్లుగాని, గమనించినట్లుగాని లేదు.

కాని, ఒకరోజు హఠాత్తుగా అనుకోనివిధంగా శివరామయ్యగారు చూశారు. వాళ్ళింత చనువుగా ఉంటున్నారనిగాని, అలా ఉండగలరనిగాని ఆయనెప్పుడూ ఊహించలేదు.

పాఠం చెప్పేసి, బయటకు వచ్చేస్తున్నాడు శ్రీహరి. గుమ్మం దాటుతున్నంతలోనే వెనకనే శ్యామల పరుగెత్తుకొచ్చి, చొక్కా పట్టుకుని ఆపింది. శ్రీహరికి దగ్గరగావెళ్ళి, అతన్ని అనుకునే అతనినోట్లో ఏదో బిళ్ళ పెట్టింది. శ్రీహరి తిరిగి ఆమెను అందుకోబోయేటంతలో శ్యామల తప్పించుకొని పారిపోయింది.

శ్రీహరి గుమ్మందాటివచ్చి మరలా పైకి చూసాడు. శ్యామల నవ్వుతూ చిలిపిగా చూస్తోంది క్రిందికి. శ్రీహరి చెయ్యి ఊపాడు వెళ్ళివస్తానని. మేడపైన ఉండి శ్యామలకూడా వెళ్ళిరమ్మన్నట్లు చెయ్యి ఆడించింది. శ్రీహరి వెళ్ళిపోయాడు.

ఇదంతా ఓ ప్రక్కనే ఉండి కళ్ళారా చూసారు శివరామయ్యగారు. 'తనెప్పుడూ ఊహించనిది జరుగుతోందా' అనిపించింది. దీన్ని ముదరనివ్వడం కూడా మంచిదికాదని నిర్ణయించుకున్నారాయన.

మర్నాడు మామూలుగానే వచ్చాడు శ్రీహరి. అతన్ని పిలిచారు శివరామయ్యగారు. కొద్దిగా హితబోధచేసి, అక్కడికి రావడం చాలవరకూ తగ్గించుకుంటే మంచిదని చెప్పారు.—అంటే పరోక్షంగా, అసలు రావద్దని ఆయన అర్థం.

ఇలా జరుగుతుందని అనుకోని శ్రీహరి మొదటిసారిగా దెబ్బతిన్నాడు. దించినతల పైకి ఎత్తలేదు. అంతే, అలానే వెళ్ళిపోయాడు మాట్లాడకుండా.

శ్యామల నిశ్చేష్టురాలైపోయింది. వెళ్ళిపోతున్న శ్రీహరిని చూస్తూ, అలాగే నిలబడిపోయింది. ఆమె అంతకన్నా ఇంకేమీ చెయ్యలేదు.

ఆరోజునుండీ శ్రీహరి శ్యామలను చూడలేకపోయాడు. ఆమె ఎలా ఉందో, ఏం చేస్తోందోనన్న విషయాలేమీ తెలిసేవికావు. తనలో తను మథనపడి బాధపడటంతప్ప ఇంకేం చేస్తాడు

తర్వాత చాల రోజులకు సినిమా హాలులో కన్పించింది శ్యామల.

ఏమీ తోచక తనొక్కడే సినిమాకు వెళ్ళాడా రోజున. ఇంటర్వెల్ అయింది. బయటకోసారి వెళ్ళివచ్చి కూర్చున్నాడు. హాలులో జనం ఎక్కువగాలేరు. రెండువరుసలముందు కూర్చుని వెనక్కి తిరిగి తనవైపే చూస్తోంది శ్యామల. శ్రీహరికి ప్రాణం లేచివచ్చినట్లయింది. శ్యామలప్రక్క తల్లిగాని, తండ్రిగాని లేరు. 'బహుశా ప్రక్కనేఉన్న స్నేహితురాళ్ళతో వచ్చిఉంటుం'దనుకున్నాడు.

సినిమా మొదలుపెట్టారు. కాని, శ్యామల సినిమా చూడలేదు. వెనక్కితిరిగి శ్రీహరిని చూస్తూనేఉంది

సినిమా అయిపోయింది. అందరూ బయటకు వచ్చారు. వాళ్ళందరిలో శ్యామలను పలుకరించడం అతని కిష్టంలేదు. నెమ్మదిగా ముందుకు వడుస్తున్నాడు.

"మాష్టారూ!" — పిలిచింది శ్యామల.

శ్రీహరి ఆగాడు. శ్యామల దగ్గరకు వచ్చింది. ఏమీ మాట్లాడలేక తలవంచుకుని నిలబడింది దీనంగా. శ్రీహరికి కూడా ఏం మాట్లాడాలో తెలిసిందికాదు. ఊరికే ఆమెను చూస్తూ నిలబడ్డాడు. శ్యామల కనబడిందన్న సంతోషంతోపాటు, వెంటనే విడిపోతుందనే విచారం కూడా అతనిలో స్థానం చేసుకున్నాయి.

శ్యామల తల పైకెత్తింది.

"మిమ్మల్ని జ్ఞాపకం తెచ్చుకోని క్షణంలేదు మాష్టారూ."

"అదృష్టవంతుణ్ణి శ్యామలా" విషాదంగా నవ్వాడు. శ్యామలకూడా నవ్వడంలేదు. ఆమె ముఖంలోనూ విషాదమే.

"కాని.....ఎట్లా.....మాష్టారూ ?" ఆమె ముఖం కుంచుకుపోయింది.

ఏంచెబుతుం దామె! ఆ 'ఎట్లా' అన్న మాటలో ఎన్ని అర్థాలు! ఎన్ని కష్టాలు' వాటన్నిటినీ ఎలా ఛేదించగలదామె. ఆమె నిస్సహాయత ముఖంలో స్పష్టంగా కనిపిస్తోంది.

శ్రీహరి అర్థంచేసుకున్నాడు శ్యామలను. ఆమె ఏ ఉద్దేశం లోపల ఉంచుకొని మాట్లాడుతోందో అతనికి తెలుసు. కాని, అతనేమీ చేయలేడు. చేసే పరిస్థితిలో లేడు తను.

"మనం గాలిమేడలు కట్టుకొని లాభంలేదు. బాధపడకు శ్యామలా. మర్చిపోవడానికి ప్రయత్నించు. నువ్వు ఆకాశంలోని తారవు—నేను భూమ్మీదనున్న కేవలం......" అతను మాట్లాడలేకపోయాడు.

"వెళ్ళు......వాళ్ళు చూస్తున్నారు" అంటూ ముందుకు నడిచాడు భారంగా.

"అప్పుడప్పుడూ కన్పిస్తూండండి మాష్టారూ" శ్యామల గొంతులోంచి కష్టంగా వచ్చిన మాటలు మాత్రం ముందుకుపోతున్న తనకు వినబడ్డాయి.

వాళ్ళ కారు కదిలి వెళ్ళిపోయింది.

శ్రీహరి నిలబడిపోయి వెళ్ళిపోతున్న కారును చాలాసేపు చూసాడు. అతని హృదయం బరువెక్కిపోయింది. పిచ్చిగా శ్యామలను తలుచుకుంటూ అర్థరాత్రివరకూ ఎక్కడెక్కడో తిరిగాడు.

అదే శ్యామలను ఆఖరిసారి చూడటం.

మరలా కనబడుతుందేమోనని ప్రయత్నించాడు శ్రీహరి. కాని, ఆమెను చూడలేకపోయాడు. ఆ సంవత్సరముతో అక్కడ చదువు మానేసాడు. వేరే కాలేజీలో చేరాడు.

అప్పటినుండీ స్మృతిలో నిలిచిపోయిన శ్యామల అనుకోనిరీతిగా ఈవేళ కన్పించింది.

"ఎంత విచిత్రంగా కలిసామో" అనుకున్నాడు మనసులో శ్రీహరి.

* * *


"నువ్వు చాలా మారిపోయావు శ్యామలా. సన్నంగాఉండేదానవు—ఇప్పుడు కొద్ది వళ్ళు చేసావు" శ్యామలను చూసాడు శ్రీహరి.

"కాలంతోపాటు మార్పు సహజమే మాష్టారూ. ఎవ్వరూ తప్పించలేరు. మీకు నేను వళ్ళు చేయడమే కన్పించింది తప్ప, నన్ను గురించి మీరేమీ అడగరేం?"

శ్రీహరి సిగ్గుపడ్డాడు. శ్యామల చెప్పింది నిజమే. ఆమె గురించి తనేమీ అడగలేదు. ఎన్నో ఉన్నాయి అడగవలసినవి. అవన్నీ కొల్లలుగాఉన్నా, ఏ మడగాలో తనకి బోధపడటంలేదు. గతాన్ని గురించి ఎలా మొదలుపెట్టి ఎలా అడగాలో తోచడంలేదు.

"నాకు పెళ్ళయింది....." శ్యామల కంఠంలో నుండి వచ్చినట్లు లేదా మాట.

శ్రీహరి అతి కష్టంమీద తనను తాను సంబాళించుకున్నాడు. తను ముందే ఊహించాడు కొద్దిగా. కానతను అడగకుండా తనే స్వయంగా చెప్పింది.





## పూవు మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన దర్యానుగురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేది, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామా యున్ను వెంటనే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీలగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో మీకు జయముకలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రమే వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. Dev Dutt Shastri, Raj Jyothishi (W. P.) JULLUNDUR CITY.



### తుషార్ వంటింట్లో వుంటే ఇంట్లో అంతా ఆరోగ్యమే

తన కుటుంబంలోనివారి ఆరోగ్యం వారు తినే ఆహారం పై ఎక్కువగా ఆధారపడుతుందని వివేకి అయిన ప్రతి తల్లికి తెలుసు. వంట చేయుటకు సరైనది తుషార్ - ఏ, డి, విటమినులతో ప్రశస్తి కెక్కిన వనస్పతి అని కూడా ఆమెకు తెలుసు.




# తుషార్

ఏ, డి, విటమినులుగల వనస్పతి

తుంగభద్ర ఇండస్ట్రీస్ లి., కర్నూలు

ASP/TL


## తొలకరి వానలు

శ్యామల మరలా మాట్లాడలేదు. ఇద్దరూ మౌనంగా నడుస్తున్నారు.

పడమటిఎండ తగ్గిపోయింది. గాలి ఇంకా చల్లగా వీచడం మొదలుపెట్టింది.

శ్రీహరి చిన్నఇంటిముందుకు తీసుకువచ్చి ఆగాడు.

"ఇదే మా ఇల్లు" శ్యామలవంక చూశాడు.

శ్యామల ఆశ్చర్యపడింది. మొదట్లో నమ్మలేక పోయింది.

చిన్నఇల్లది. పూరిపాకలా ఉంది. ఒక పెద్దగది, దాని నానుకొని చిన్న వసారా. వసారాగోడ ఒక ప్రక్కన కొద్దిగా కూలిపోయిందికూడా. ఇల్లు కట్టి చాల సంవత్సరాలైనట్లుంది. చుట్టూ తిరిగి అంతా చూసింది శ్యామల. ఆమె కంతులేని విస్మయం కలిగింది.

ఇల్లు ఎంత చిన్నది, బాగా లేకపోయినా, ఇంటి చుట్టూమాత్రం నందనవనంలాఉంది. అన్నీ చెట్లు, తీగలు, పూలమొక్కలు ఒకదానికొకటి పెనవేసుకుని ఉన్నాయి. ఒకప్రక్కగా చిన్న పందిరి—పందిరిమీద అంతా మల్లె. కడుపు నిండిపోయేలాఉంది చూడ టానికి. పూలన్నీ విచ్చుకుని ఉన్నాయి. ఎవరూ ఆ పూలను కోస్తున్నట్లు కనబడదు. ఇంకోప్రక్క గులాబీమొక్క. ఇంచుమించు అన్ని పుష్పాలూ కన బడ్డాయి శ్యామలకు.

"ఈ ఇంటికి ఇదే అందం" అనుకుంది.

మాష్టారిసంగతి తెలుసు తనకు. చిన్న ఇల్లని, ఇతర ఆధారమేమీలేదని, అన్నీ అప్పుడు తనతో చెప్పారాయన. చెప్పినా, ఇంటిని పెద్దదిగానే ఊహించుకొందప్పుడు. ఆ ఇంటినే ఇప్పుడు కళ్లారా చూసింది తను. "మాష్టారు ఇంత నిర్భాగ్యులా!" అనుకుని మనసులో బాధపడింది. ఈ ఇంటిని, తమకున్న రెండంతస్తుల మేడతో పోల్చిచూస్తే! శ్యామలకు నవ్వు వచ్చింది ఎందుకో.

"ఎంత అంతరం?"

వీటి అంతరమేముంది! అసలు మనుషులమధ్య నున్నదే పెద్ద అంతరం.

సానుభూతితో కూడిన తలంపులన్నీ వస్తు న్నాయి ఆమెలోకి.

శ్రీహరివచ్చి తాళం తీస్తున్నాడు.

"ఇదేమిటి! ఎవరూ లేరా ఇక్కడ?" దగ్గరగా వచ్చింది శ్యామల.

"ఉన్నది మా అమ్మేగా—ఆవిడ మా చెల్లిగారింటికి వెళ్లింది నిన్ననే"

"ఆ సంగతి చెప్పలేదేం?"

అతనేమీ మాట్లాడలేదు.

"నన్ను ఒంటరిగా తీసుకురావడంలో మీ ఉద్దేశం?"

"శ్యామలా!" నిరుత్తరుడైపోయాడు శ్రీహరి. "చెప్పవలసిన విషయమని అనుకోలేదు. లేకపోతే అక్కడే చెప్పేవాడిని. నువ్వు నన్నింత చెడ్డగా...."

మాట పూర్తికాకుండానె పకాలున నవ్వేసింది శ్యామల. శ్రీహరి ఆమెకేసి తిరిగాడు. ఆమె అలా నవ్వుతూనే ఇంటిని పరిశీలిస్తోంది. "ఊరికే అన్నాను మాష్టారూ! బలే భయమండి. న్యాయంగా మంచి వాళ్ళ కసలు భయమనేది ఉండకూడదు. కాని

వాళ్ళకే ఎక్కువ భయం. నేనలాంటిమాట వేడిచి పెడతానని, నిజంగా అలా భావిస్తానని మీరు నమ్ముతున్నారా?.....అయితే ఇప్పుడు మీరే నన్ను అర్థం చేసుకోలేదన్నమాటేగా!"

చెప్పుతూ ఇంటిలో ప్రవేశించింది శ్యామల. శ్రీహరికి నోట మాటరాలేదు. మాట్లాడినా లాభంలేదనుకున్నాడు. లోపల ఇల్లంతా కలయ చూస్తోంది శ్యామల. ఇంటిలో చెప్పుకోదగిన సామానుకూడా లేదు. అతి సామాన్యంగా ఉంది ఇల్లంతా. పైకి చూసింది. అన్నీ కన్నాలే. ఒకో రంధ్రంగుండా ఆకాశంకూడా కనబడుతోంది.

"వర్షంవస్తే ఇందులో మనుషులు ఉండగలరా" అనుకుంది.

"చాలా విచిత్రంగాఉందికదూ మా ఇల్లు?" భావగర్భితంగా మాట్లాడాడు శ్రీహరి.

శ్యామల ఇవన్నీ వినిపించుకున్నట్లే లేదు. ఇల్లంతా తిరుగుతూ, ఇంటిలో ప్రతి వస్తువూ చూడటంలో నిమగ్నమైపోయిందామె.

అంతా అయినతర్వాత వచ్చి, "మరి వంట ప్రయత్నం" అంది శ్యామల. హోటలునుండి కారియర్ రప్పిస్తానన్నాడు శ్రీహరి. శ్యామల అంగీకరించలేదు. తనే వంట చేస్తానంది. శ్రీహరి చెప్పినా ఆమె వినిపించుకోలేదు.

మరి మాట్లాడకుండా వంటసామగ్రి, ఇంకా కావలసినవన్నీ చూపించాడు. అతనికంతా ఆశ్చర్యంగా ఉందామె ప్రవర్తన. తనేమైనా మాట్లాడి సమాధానం చెబుదామంటే, ఆ అవకాశం రానివ్వకుండానే తన నోరు కట్టేస్తుంది ముందే. తను ఓడిపోతున్నాడు.

ఇప్పటివరకూ గంభీరంగా తనకూడా నడిచి వచ్చిన శ్యామల అప్పుడే ఇంత చలాగ్గా అయిపోయి, ఇంటిమనిషిలా పనులు చేస్తోంది.

శ్యామల స్థితిమంతురాలేనని తెలుసు శ్రీహరికి. కాని, అలాంటిభావాలు ఆమెలో అప్పుడూ చూడలేదు, ఈరోజు ఇప్పుడుకూడా చూడలేదు. ఆమె మనసు తనకు పూర్తిగా తెలుసు. తనను చూడటానికి వచ్చి ఈ గుడిసెలో ఇలాంటి పనులమీద ఆసక్తి చూపుతోందంటే, శ్రీహరి ఏమీ వూహించుకోలేకపోయాడు.

కాస్సేపటికి వంట పూర్తిచేసింది శ్యామల. స్వయంగా తనే వడ్డించింది శ్రీ హరికి. తర్వాత తనూ భోంచేసింది.

* * *

వాకిట్లో రెండు మంచాలు వేసుకుని చెరో మంచంమీదా కూర్చున్నారు ఇద్దరూ. పైన చంద్రుడు తెల్లగా నవ్వుతున్నాడు. చల్లని పిల్లగాలులు పూలచెట్లమీదనుండి పరుగెడుతూ, గిలిగింతలు పెడుతున్నాయి. ఆ వెన్నెల మధ్యలోకూర్చుంటే తనేదో క్రొత్తలోకంలో ఉన్నట్లనిపించింది శ్యామలకు.

"అబ్బ—ఎప్పుడూ ఇలా ఉండిపోతే" మనసులో అనుకుంది, కలల్లో తేలుతూ.

"ఈ ప్రకృతి ననుభవిస్తున్నవాళ్ళు ఎంత ధన్యులండి."

"ప్రకృతి అంటే అంతటికీ వర్తిస్తుందిగా. అందరూ అనుభవిస్తున్నారుగా దీనిని. ఇక్కడ వేరే ప్రకృతి ఏముంది?"

శ్రీహరి ఇంకా మాట్లాడదామనుకున్నాడు శ్యామల అడ్డు తగలకపోతే.

"బలే చెప్పారు! దేవుడు సృష్టించింది అంతా ప్రకృతే కావచ్చు. కాని, ఇక్కడున్న ప్రకృతి, పట్టణంలో ఉంటుందా మాష్టారూ. పట్టణానికీ, దీనికీ ఏమైనా పోలికఉందా? ఇక్కడున్న గాలి, ఇక్కడున్న హాయి పట్టణంలో ఉంటుందా? ఇక్కడున్నది అసలు ప్రకృతి — పట్టణంలో ఉన్నది కృత్రిమ ప్రకృతి. అక్కడ ఆనందమనేది ఉంటుందా! అంటే కొందరికి ఉండవచ్చు. ఏమో......నన్ను ఇలాంటి చోటనే ఉండమంటేనా, నా కింకేమీ అక్కర్లేదు" ఏదోటోనుతో చెబుతోంది శ్యామల తన్మయత్వంతో.

శ్రీహరికి నవ్వు వచ్చింది. 'ఎప్పుడూ పల్లె జీవితం అనుభవించలేదు కాబట్టి, శ్యామలకు అలా అనిపిస్తోంది' అనుకున్నాడు. ఆ సరదాయైనా మొదట్లోనే. తర్వాత ఉండదు. పల్లెప్రజలు పట్నంకోసం కలలు కనడం, పట్నంలోనివారు పల్లెజీవితం బాగుంటుందనడం మామూలే. క్రొత్తేమీ కాదు. ఈ విరుద్ధభావాలు మొదటినుండీ ఉన్నవే.

"నీ అదృష్టం పండిందిరా! మీ అత్త చచ్చిపోయినదని పత్రికలో చూశాను."

"నిజమేరా. కాని ఏ లాభం. అంతో ఇంతో ముట్టచెప్పక పోతుందా అని ఆమె పెంచుతున్న పెంపుడు పిల్లుల్ని ఎనిమిదేళ్ళు నెత్తిన ఎక్కించుకున్నాను."

"ఇంతకూ మీ అత్త నీకే మిచ్చిం దేమిటి?"

"పిల్లుల్ని!"

ఎస్. స్వర్ణమాల (విజయవాడ)

శ్యామలకుమాత్రం ఏమీ సమాధానం చెప్పలేదు శ్రీహరి. హఠాత్తుగా, శ్యామల గురించి తెలుసుకోవాలని గుర్తువచ్చింది.

ఆమె కనబడినప్పటినుండీ తనకు అనుమానంగానే ఉంది. 'పెళ్ళయిందా' అని తను అడగనైనా అడక్కుండా తనే 'నాకు పెళ్ళయింది' అని చెప్పింది. ఆ ముక్క చెప్పేసి, తర్వాత మరి మాట్లాడలేదు. అప్పటినుండీ శ్యామలను పూర్తిగా అడుగుదామనే అనుకుంటున్నాడు. కాని, తనకు తెలియని భయమో, లేక సంకోచమో అడగకుండా చేస్తోంది. శ్యామలకు పెళ్ళయినట్లుకూడా కనబడటంలేదు.

శ్రీహరి మెదడులో దారీ, తెన్నూలేని ఆలోచనలు వస్తున్నాయి. "నిన్ను గురించి చెప్పేవుకాదు శ్యామలా! మీ అత్తవారు—" ఇంకా ఏదో అనబోయి, ఆమె వంక చూసాడు. వెన్నెల్లో తెల్లగా మెరుస్తున్న ఆమెముఖం వాడిపోయి, క్రిందికి వంగిపోయింది. శ్రీహరి చాలా ఆశ్చర్యపడ్డాడు.

"ఈ వాతావరణం బాగుంది మాష్టారూ" తల కొద్దిగా పైకి ఎత్తి అంది. ముందున్న ప్రసన్నత ఆమెముఖంలో లేదు.

"బాగానే ఉందికాని.....మీఅత్తయ్యనేం చేస్తారు?" శ్రీహరి భయపడుతూనే అన్నాడు. సమాధానం కోసం చూస్తున్నాడు.

శ్యామల కుంచించుకుపోతోంది ఇంకా.

"నే నిక్కడ ఉండటం యిష్టంలేదా మీకు? దయచేసి ఆ విషయాలేమీ అడక్కండి నన్ను."

గతుక్కుమన్నాడు శ్రీహరి. అతనికంతా అయోమయంగా ఉంది. అత్తవారి విషయం ఎత్తితే చాలా బాధ పడుతోంది. ఆ విషయం అడగవద్దంటోంది. ఏమిటి కారణం?—ఇష్టంలేని పెళ్ళి చేసారా?

దాంపత్యం సరిగా జరగడంలేదా? అతను మంచివాడుకాదా?

అసలు కారణం తెలియకుండా ఎన్ని ప్రశ్నలు మాత్రం వేసుకొని ఏం లాభం? ఆవిషయంలో ఆమెను అడగకూడదనుకున్నాడు శ్రీహరి.

"గాలి బాగా వీస్తోందండి మాష్టారూ" శ్రీహరి ఆలోచనలకు అంతరాయం కలిగింది.

"ఈవేళేకాదు. సంవత్సరం పొడుగునా ఇదే హాయి ఉంటుం దిక్కడ."

"అదృష్టవంతులు మీరు. దానికి కూడా పెట్టి పుట్టాలి."

"ఏమిటీ శ్యామలా నిరాశగా మాట్లాడుతున్నావు. ఇప్పటివరకూ తమాషాగా మాట్లాడావు. మరలా, ఇప్పుడే అంత బేలగా మారిపోయావేమిటి?" ఆమె విచారము తనకు తెలిసినా, ఆమెను సంతోషపర్చాలని అన్నాడు.

"ఆకాశంలో మబ్బులున్నాయండి" మోచేతిమీద ఆనుకుని మంచంమీద పడుకుంది శ్యామల.

"అవును మబ్బులుంటాయి. వర్షం కూడా రావచ్చు. ఈ మే, జూన్ నెలల్లోనే తొలకరివానలు పడతాయి—ఫర్వాలేదు వర్షంవస్తే లోపలకు వెళ్ళవచ్చు" అలా అన్నాడేగాని, 'వర్షమొస్తే అంతా వర్షం లోపల ఉండలేము' అనిమాత్రం అనలేకపోయాడు.

"నాకు నిద్రవస్తోంది పడుకుంటాను" అని అనేసి, మామూలుగా పడుకుని నిద్ర కుపక్రమించింది శ్యామల.

* * *

"మాష్టారూ! మాష్టారూ! లేవండి వర్షం"

మంచందగ్గరకువచ్చి, కంగారుగా శ్రీహరిని లేపుతోంది శ్యామల. నిద్రమత్తునుండి ఉలిక్కిపడిలేచాడు శ్రీహరి. అర్థమైం దతనికి. అప్పటికే వర్షపు జల్లు ఎక్కువైంది. శ్యామల కొద్దిగా తడిసింది.

"వర్షపు చినుకు లంత మోపైనా మీకు మెలకువ రానేలేదు."

"అనుకున్నట్లుగానే వచ్చిందే వర్షం!" మంచం

క్రొత్త పెద్ద డబ్బా

కాల్గేట్

బేబీ పౌడరు

ఎక్కువ పౌడరు...
ఎక్కువ పొదుపు...
సులభంగా పెట్టగల
క్రొత్త మూత!




పసిపాప యొక్క
లేత చర్మమునకు
ఉపశమనము కలిగించును!



కుష్టు సమస్త మేహ వ్యాధులకు
బొల్లి
మొదట నెలలో 40% నివారణ!!!
10% నివారణ!!
మా లెప్సిన్ అమోఘ ఔషధము!!!
వివరములకు గ్రంధే రఘురామ గుప్త
అమర జ్యోతి ప్రొడక్ట్స్ మార్కాపురం కర్నూలు జిల్లా


# తొలకరి వానలు

ఇదీ నా జీవితం. నే నిప్పుడు విధవనే నంటారా మాష్టారూ! మిమ్మల్ని అడగటం పొరపాటు. నేను విధవను. అలా శాసించింది సంఘం. మెళ్లో మంగళ సూత్రం మూడురోజులే ఉంది. తర్వాత పోయింది. బొట్టులేదు. అవును. నేను విధవనే.

రాత్రి తొలకరివానల పుణ్యంవలన నేను రక్షించ బడ్డాను. లేకపోతే క్షణికావేశంలో నాశనమైపోయే దాన్నేమో. మీకున్న నిబ్బరం నాకు లేకపోయింది. మీలో ఇంత మంచి గుణముందని రాత్రే గ్రహించ గలిగాను. ఆవేశానికి హద్దు పెట్టగలిగారు. నే నిప్పుడు సిగ్గుపడుతున్నాను.

ఇక వ్రాయలేను మాష్టారూ. మీకు ఉద్యోగం వస్తుంది. మంచి సుగుణవంతురాల్ని పెళ్ళిచేసుకొని సుఖపడండి. భవిష్యత్తంతా మీకు వెన్నెలే. ఎప్పుడూ, ఆఖరిశ్వాస విడిచేవరకూ నేను కోరుకునేది మీ సుఖమే. శ్యామలను మనసులోకి రానివ్వకండి.

సెలవు మాష్టారూ! ఇట్లు,

శ్యామల.

బుఱ్ఱ వేడెక్కిపోయింది శ్రీహరికి. కళ్ళంట నీళ్ళు కారుతున్నాయి. తనస్థితి తను గ్రహించుకో లేకపోయాడు. చేతిలోని ఉత్తరం క్రిందపడిపోయింది.

'శ్యామలా' అంటూ బయటకు పరుగెత్తాడు.

పరుగెత్తుతున్నాడు స్టేషనుకి. ఎక్కడో కొట్టిన ఏడుగంటలు వినిపించాయి. శ్రీహరి పరుగు హెచ్చించాడు.

ఇంకో పదినిమిషాల్లో బండి వెళ్ళిపోతుంది. అందుకోగలడా? బండి దాటిపోతుందేమో! శ్యామ లను అందుకోగలడా!

శ్రీహరి పరుగు హెచ్చించాడు. రైలును అందు కోవాలి. ఆయాసంగా రొప్పుతూ పరుగెడుతున్నాడు 'కూ' అని రైలుకూత వినిపించింది. ఇంకెంతో దూరంలేదు స్టేషను.

స్టేషనుదగ్గర కొచ్చేసరికి ఆఖరికూత కూసింది రైలు.

గేటులోంచి సరాసరి దూసుకుంటూ ప్లాట్ ఫారమ్మీదకు వెళ్ళిపోయాడు శ్రీహరి. అప్పటికే బండి బయలుదేరింది. అయినా ఎక్కాలి. ముందుకు పోతున్నాడు కదిలిపోయిన బండికోసం.

వెనకనుండి నాలుగు చేతులు బలంగా ఆపు చేసాయతన్ని.

"ప్రాణాలు పోతాయయ్యా" ఎవరో అన్నారు ప్రక్కనుండి.

"లేదు— విడిచిపెట్టండి నన్ను" శ్రీహరి రొప్పుతున్నాడు.

"ఇంకో బండి ఉంది. దానికి వెళ్ళవచ్చు."

"వీల్లేదు. దాటిపోతుంది" విడిపించుకోడాన్కి ప్రయత్నించాడు.

"ఏం భయపడకు. ఆ బండి ఎక్కించి గమ్య స్థానం చేర్చే బాధ్యత నాది. సరా" భరోసాఇచ్చి గట్టిగా పట్టుకున్నాడాయన.

"ఆ బండికా!......వెళ్ళమంటారా?" పిచ్చిగా గొణుక్కున్నాడు శ్రీహరి.

రైలు దూరంగా కూతవేసుకుంటూ వెళ్ళి పోయింది. ★